నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 22 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL


ఆదిలాబాద్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల్ శంకర్, ఎస్పీ గౌష్ ఆలం

## పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం,అక్టోబర్21: తమ కుటుంబ సభ్యులను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో ఒక పోలీసు వ్యవస్థనే ఇతరుల కోసం ప్రాణాలను సైతం అర్పిస్తుందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్లాగ్ డేను నిర్వహించారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో గల అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ రావు, జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, రెండవ బెటాలియన్ కమాండెంట్ ని తికా పంత్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, ఇతర శాఖల ఉన్నతాధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలతో స్తూపం వద్ద నివాళులర్పించారు. కలెక్టరేట్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ తీశారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని కలెక్టర్ అన్నారు. అనంతరం ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ రాష్ట్రం లో ఎక్కడా లేని విధంగా జిల్లా హెడ్ క్వార్టర్లలో వారి ముఖ చిత్రాలతో అమరవీరుల స్తూపాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమరవీరుల కుటుంబ సభ్యులు, అదనపు ఎస్పీ ఆపరేషన్ బీ సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పీ శ్రీనివాస్, సీహెచ్ నాగేందర్, డీ సురేందర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

#### జిల్లాకేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ

అమర వీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో కలెక్టర్ చౌరస్తా నుంచి వినాయక్ చౌక్ వరకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పోలీసు అధికారులు, సిబ్బంది, పట్టణవాసులతో కలిసి భారీ కొవ్వొత్తుల ర్యాలీ తీశారు.

#### అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

-నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 21 : విధి నిర్వహణలో అమరులైన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై కాగడాను వెలిగించారు. దేశ సరిహద్దు భద్రతలో సైనికుడు ఎంత కీలకమో రాష్ట్ర భద్రతలో పోలీసు కూడా అంతే కీలకమన్నారు. పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అమరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితిని సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పోలీసు అమరులకు సంతాపంగా మౌనం పాటించి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సూర్యనారాయణ, భైంసా ఏఎస్పీ అవినాష్, డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


నిర్మల్ అర్బన్: అమరుల స్తూపం వద్ద కాగడను వెలిగిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

## 30న కుమ్రం భీం విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణ కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

భీంపూర్, అక్టోబర్ 21 : భీంపూర్ మండల కేంద్రంలో ఈ నెల 30న నిర్వహించనున్న కుమ్రం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని సోమవారం భీంపూర్ మండల ఆదివాసీ సంఘాల ప్రతినిధులు నేరడిగొండలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను ఆహ్వానించారు. విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే, నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడావి లింబాజీ, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు మడావి పాండురంగ్, నాయకులు సిడాం పురుషోత్తం, జైవంత్, కుడిమెత గంగారాం తదితరులున్నారు.

# అన్నదాతల ఆందోళన ఉద్రిక్తం

**రుణమాఫీ, రైతుభరోసా అమలు చేయాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో రైతుల ధర్నా**

- వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావడంతో అడ్డుకున్న పోలీసులు
- దురుసుగా ప్రవర్తించినందుకు పోలీసులు క్షమాపణ చెప్పాలని డిమాండ్


కలెక్టర్ కార్యాలయంలోకి వస్తున్న తుడుందెబ్బ నాయకులు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు


ఆదిలాబాద్ కలెక్టరేట్‌లోకి దూసుకువస్తున్న రైతులు

ఆదిలాబాద్, అక్టోబర్ 21 ( నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలతో పాటు వరంగల్ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ సోమవారం ఆదివాసీ హక్కులు పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట రైతులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని, రైతుభరోసా పథకం కింద ఎకరానికి రూ.15 వేలు అందజేయాలని, వరంగల్ డిక్లరేషన్‌లో భాగంగా పత్తి క్వింటాల్‌కు రూ.10 వేలు అందజేయాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా చేశారు. అనంతరం గిరిజన సంఘాల నాయకులు, రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కార్యాలయంలోకి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది.

#### పోలీసులపై చర్యలు తీసుకోవాలి

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కలెక్టర్ రాజర్షి షా ప్రజావాణి కార్యక్రమం నుంచి బయటకు వచ్చి తుడుందెబ్బ నాయకులు, రైతులతో మాట్లాడారు. వినతిపత్రం ఇచ్చేందుకు వస్తున్న పోలీసులు తమపై ఇష్టానుసారంగా వ్యవహరించారని, జెండాలు, కండువాలు లాక్కున్నారన్నారని, మహిళా నాయకులను మగ పోలీసులు అడ్డుకున్నారని వారికి చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, తమను దుర్భషలాడినా పోలీసులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్ర, రైతులు పాల్గొన్నారు.

#### సర్వే కోసం ఎవరూ రాలేదు



నాలుగు ఎకరాలు భూమి ఉంది. పత్తి, కందులు వేస్తాం. నేను గుడిహత్నూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ. 1.60 లక్షలు అప్పు తీసుకున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీ చేస్తామని చెప్పినా లోన్ మాత్రం మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే మాకు తెలియదు అంటున్నారు. లోన్ మాఫీకానీ రైతుల సర్వే చేస్తున్నట్లు ప్రభుత్వం చెప్పింది. ఇప్పటి వరకు మా ఇంటికి సర్వే కోసం ఎవరూ రాలేదు. రైతుబంధు పైసలు కూడా అందలేదు.

*- మెస్రం గంగమ్మ, వాఘాపూర్, మావల మండలం*


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తుడుందెబ్బ నాయకులు

#### రుణమాఫీ కాలేదు.. రైతుభరోసా రాలేదు..



నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. పత్తి, సోయాబిన్, కంది పంటలు పండిస్తాను. గత ప్రభుత్వం ఉన్నప్పుడు రైతు బంధు పైసలు వచ్చేవి. ఇప్పుడు ఆ పైసలు ఇంకా రాలేదు. పెట్టుబడుల కోసం బాగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నేను తాంసి మండలం కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1.60 లక్షల పంట రుణం అప్పు ఉన్నాను. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వస్తే రైతుల బ్యాంక్‌లోన్‌లు మాఫీ చేస్తామని చెప్పింది. కానీ ఇప్పటికీ మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే మాకు ఏమి తెలియదు అని అంటున్నారు.

*- నైతం శ్యాంరావు, రైతు, గొల్లఘాట్, భీంపూర్ మండలం*

#### చాలామందికి రుణమాఫీ కాలేదు



మా గ్రామంలో అందరం పేద గిరిజన రైతులం. అప్పులు చేసుకుంటూ పంటలు పండించుకుని ఉపాధి పొందుతాం. కాంగ్రెస్ నాయకులు అధికారంలో వస్తే రైతుల బ్యాంక్ లోన్‌లు మాఫీ చేస్తామని చెప్పారు. గెలిచాక రూ. 2 లక్షల కంటే ఎక్కువ లోన్ ఉంటే మాఫీ కాదని, రేషన్‌కార్డు లేదంటూ షరతులు పెడుతున్నారు. నేను ఆదిలాబాద్ ఎస్బీఐలో రూ.2 లక్షల రుణం తీసుకున్నాను. కానీ మాఫీ కాలేదు. రైతు భరోసాలో ఇస్తామని చెప్పిన రూ.15 వేలు ఇంకా రాలేదు.

*- మెస్రం తులసీరాం, మాలేబోరిగాం. ఆదిలాబాద్ రూరల్ మండలం*


భైంసాలో తడిసిన సోయా బస్తాలు

## వర్షం..రైతన్నకు కష్టం

కుంటాల, అక్టోబర్, 21: కుంటాల మండలంలోని కల్లూరు, అందకూర్ తదితర గ్రామాల్లో సోమవారం వర్షం కురవడంతో ఆరబెట్టిన ధాన్యంపై టార్పలిన్ కవర్లతో తడవకుండా కాపాడేందుకు రైతులు తిప్పలు పడ్డారు. కొద్దిపాటి వర్షం పడినా ధాన్యం తడిస్తే కొనుగోలు కేంద్రం వద్ద తేమ శాతం రాదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేల తడవడంతో యంత్రాలతో సోయా పంటను కోస్తున్న రైతులకు తిప్పలు తప్పడం లేదు.

#### భైంసా పట్టణంలో..

భైంసా, అక్టోబర్, 21 : పట్టణంలో సోమవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గాంధీ గంజ్‌కు తీసుకవచ్చిన సోయా తడిసిపోయింది. పట్టణ రోడ్లపై డ్రైనేజీల నుంచి వచ్చిన మురుగునీరు పారడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.


కుంటాల అందకూర్ ధాన్యం కుప్పలపై కవర్ కప్పుతున్న రైతులు

#### పోషకాహారం లోపం ఉన్న పిల్లలను గుర్తించాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్, 21: జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో తీవ్ర పోషకాహార లోపంతో ఉన్న, సాధారణ పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించాలని నిర్మల్ జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సోమవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి పోషకాహార స్థాయిని పెంచేందుకు వారి కుటుంబాలకు అవగాహన కల్పించాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖతో సమన్వయం చేసుకుని వారికి తగిన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కార్యక్రమ నిర్వహణ అధికారి శ్రీనివాస్, వైద్యాధికారులు పాల్గొన్నారు.


## ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

### నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 21 : ప్రజల సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జన సురక్షా యోజనపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పీఎం విశ్వకర్మ యోజనకు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసేలా ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ మందిని తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని తెలిపారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఆర్వో భుజంగ్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

#### అర్జీల పరిష్కారానికి కృషి

ఉట్నూర్, అక్టోబర్ 21 : గిరిజనులు పెట్టుకున్న అర్జీలు సత్వరమే పరిష్కరిస్తున్నట్లు ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బోయవాడకు చెందిన శంకర్ తనకి ఉద్యోగం ఇప్పించాలని, మంచిర్యాల జిల్లా కాసిపేటకు చెందిన శంకర్ తనకు ఉన్నత చదువుల కోసం ఇప్పించాలని, గణేశ్ కిరాణా దుకాణానికి సహాయం చేయాలని ఇచ్చోడ మండలం జల్దా గ్రామానికి, దేగాం మండలం దేవులగూడకు చెందిన సోములాల్ తనకు పట్టా ఇప్పించాలని, వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన తమకు డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇతర పథకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏడీఎండ్‌హెచ్‌వో మనోహర్, ఈఈ భీంరావు, ఏవో దామోదర్, పీహెచ్‌వో సందీప్ కుమార్, జేడీఎం నాగభూషణం, పెసా కో ఆర్డినేటర్ వసంత్‌రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది , తదితరులు ఉన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్


అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

## కేసీఆర్ కృషితోనే అందరికీ ఉన్నత విద్య


మానసను సన్మానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 21 : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితోనే నేడు అందరికీ ఉన్నతస్థాయి విద్య అందుతున్నదని మాజీ మంత్రి జోగు రామన్న గుర్తుచేశారు. ఆదిలాబాద్ మండలం చాంద(టీ) గ్రామానికి చెందిన దంపతులు గౌరు మోహన్–రూప కుమార్తె మానస పట్టుదలతో వరంగల్ యూనివర్సిటీ ఎంబీబీఎస్ సీట్ సాధించింది. సందర్భంగా వారు మాజీ మంత్రి జోగు రామన్న జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం కలిశారు. వారిని జోగురామన్న సాదరంగా ఆహ్వానించి మానసతోపాటు వారి తల్లి దండ్రులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు మెరుగైన విద్య అందిస్తూ విద్యార్థులను ప్రోత్సాహం ఇవ్వడంతో నేటి ఉన్నత విద్యకు బాటలు వేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోకండ్ల రమేశ్, ఇజ్జగిరి నారాయణ, రంగినేని శ్రీనివాస్, కుమ్ర రాజు పాల్గొన్నారు.

## కోతుల దాడిలో మహిళ మృతి


బొంగొని లక్ష్మీ(ఫైల్)

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 21 : కోతుల భారీ నుంచి ప్రాణాలు కాపాడుకునే క్రమంలో కింద పడి మహిళ మృతి చెందిన విషాద ఘటన ఖానాపూర్‌లో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలో విద్యానగర్ కాలనీకి చెందిన బొంగొని లక్ష్మి(50) మధ్యాహ్న సమయంలో ఇంటి బయట ఉండగా కోతుల గుంపు ఒక్కసారిగా లక్ష్మి మీదకు వచ్చాయి. వాటి నుంచి తప్పించుకునే క్రమంలో ఒక్కసారిగా కిందపడిపోవడంతో తలకు ఆమెకు తీవ్రగాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త గంగాగౌడ్, పెళ్లిలైన ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ విషాద ఘటన కుటుంబీకులతో పాటు స్థానికులను కలవరపరిచింది. ఇకనైనా కోతుల సమస్యను ప్రభుత్వం పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నారు.


బతుకమ్మలను ఎత్తుకున్న ట్రైనీ కలెక్టర్లు, తహసీల్దార్ లక్ష్మి

## బతుకమ్మ ఉత్సవాల్లో ట్రైనీ కలెక్టర్లు

తాంసి, అక్టోబర్ 21 : మండలంలోని పొన్నారి గ్రామంలో సోమవారం ట్రైనీ కలెక్టర్లు సుబీచౌహాన్, విశ్వదీప్ మట్టు, అమర్‌జీత్ కుజురు, కుల్దీప్ మీనా, ప్రశాంత్ నానావారి, పూజా కుమారి పర్యటించి బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి అధికారులు, నాయకులు స్వాగతం పలికారు. వీరు నాలుగు రోజుల పాటు గ్రామంలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, వివిధ అంశాలను పరిశీలించి నివేదిక ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో లింగయ్య, పంచాయతీ కార్యదర్శి గంగన్న, నాయకులు రమణ, లింగారెడ్డి, రఘున్న, గంగన్న, అశోక్, కారోబార్ స్వామి, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

## పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలి

### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహా

ఎదులాపురం, అక్టోబర్ 21 : జిల్లా దవాఖానల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. సోమవారం హైదరాబాద్‌లో ఉస్మానియా, గాంధీ, కాకతీయ, ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్లు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య సేవలను అందించడంతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దవాఖానల్లో పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ హాజరై దవాఖానలో ప్రజలకు అందిస్తున్న సేవలు, విద్యార్థులకు సౌకర్యాలపై మంత్రికి వివరించారు.